## పోచమ్మ గుడికి 6 గుంటల భూదానం


చండి గ్రామంలో పెద్దల సమక్షంలో దానపత్రం రాసిస్తున్న పుల్లగూర్ల వెంకట్‌రెడ్డి

శివ్వంపేట, జులై 29: మండలంలోని చండి గ్రామంలో ఉన్న పోచమ్మతల్లి ఆలయానికి పుల్ల గూర్ల వెంకట్‌రెడ్డి, పుల్లగూర్ల అంజిరెడ్డి 6 గుంటల భూమిని దానంగా సోమవారం రాసిచ్చారు. ఆలయం చుట్టూ స్థలం లేక బోనాల సమయంలో ఇబ్బంది అవుతున్నదని, గుడి అవసరాల కోసం పోచమ్మ ఆలయం వెనక ఉన్న భూమిని కేటాయించాలని గ్రామస్తులు కోరడంతో వెంకట్‌రెడ్డి, అంజిరెడ్డి దానపత్రం రాసిచ్చారు.

## బీఆర్‌ఎస్ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ



చేగుంట,జూలై29: చేగుంట మండలం కర్నాల్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకుడు వంటరి అశోక్‌రెడ్డిని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి, ఇబ్రహీంపూర్ సొసైటీ చైర్మన్ వంటరి కొండల్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. యశోద దవాఖాన లోని వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

## ఈతవనాలు పెంచి రక్షించాలి


వెల్మకన్నలో ఈత మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ అధికారులు

కౌడిపల్లి, జూలై 29: గౌడన్నలు ఈత వనాలను పెంచి, నాణ్యమైన కల్లు అందించాలని నర్సాపూర్ ఎక్సైజ్ ఎస్సై రాఘవేందర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని వెల్మకన్న, కొట్టాల, లింగంపల్లి, గ్రామాల్లో వనమహోత్సవంలో భాగంగా ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో గౌడసంఘం సభ్యులతో కలిసి ఈత మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది ఖాజా అజీజ్‌హైమద్, హెడ్ కానిస్టేబుల్ తిరుమలయ్య, సిబ్బంది సాయి, ప్రణీత్, గౌడ సంఘం సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

## రైతులకు సొసైటీ రుణాల చెక్కులు అందజేత


రుణమాఫీ చెక్కులు పంపిణీ చేస్తున్న చైర్మన్ గోవర్దన్‌రెడ్డి

కౌడిపల్లి, జూలై 29: మండలంలోని మహమ్మద్‌నగర్ సొసైటీలో 113 మంది రైతులకు రూ.61 లక్షల 9వేల 500లకు సంబంధించిన చెక్కులను చైర్మన్ గోవర్దన్‌రెడ్డి సోమవారం అందజేశారు. పంట రుణమాఫీ కావడంతో కొత్త రుణాలిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ పద్యుమ్నారెడ్డి, సిబ్బంది దుర్గయ్యగౌడ్ పాల్గొన్నారు.

## బెట్టింగులకు అలవాటుపడి చోరీలు


చోరీకి పాల్పడ్డ నిందితున్ని అరెస్టు చేసిన పోలీసులు

రేగోడ్, జూలై 29: బెట్టింగులు భవిష్యత్తును నాశనం చేస్తాయని అల్లాదుర్గం సీఐ రేణుక అన్నారు. సోమవారం సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మక్తవెంకటాపూర్‌లో ఈ నెల 22న సంగప్ప నివాసంలో చోరీ జరిగింది. 24న సంగప్ప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. పోలీసులు దర్యాప్తు చేసి అదే గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ (వీఆర్‌ఏ) ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్నాడు. అతడు నగదు రూ.2.10 లక్షలు, 2.5 గ్రాముల బంగారం చోరీ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో పోలీస్ సిబ్బంది వినోద్, రామ్‌సింఘ్, ప్రవీణ్, రవి రంగంలోకి దిగి చోరీకి పాల్పడిన నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నగదు, బంగారం స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు పంపించారు. చోరీకి గురైన నగదు, బంగారాన్ని కోర్టులో డిపాజిట్ చేశారు.



శివ్వంపేట, జులై 30: గుండ్లపల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్రామిరెడ్డి సొంత డబ్బులు రూ.60 వేలతో సోమవారం బోరు వేయించారు. కాంగ్రెస్ నర్సాపూర్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి బోరును ప్రారంభించారు.

## స్థాయిని మించి వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం



కౌడిపల్లి, జూలై 29: బీజేపీ నాయకులు సీఎంపై స్థాయిని మించి వ్యాఖ్యలు చేస్తే ఊరుకోమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు హెచ్చరించారు. సోమవారం కౌడిపల్లిలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల హామీలు తప్పకుండా అమలు చేస్తామన్నారు. చిత్తశుద్ధితో పనిచేస్తున్న కాంగ్రెస్‌పై బురద చల్లడం ఎంత వరకు సమంజసమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకొచ్చి అన్ని స్థానాలు కైవసం చేసుకుంటామన్నారు. సమావేశంలో మహమ్మద్‌నగర్ సొసైటీ చైర్మన్ గోవర్దన్‌రెడ్డి, వైస్ చైర్మన్ చిన్నంరెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు రఘుపటేల్, పాష, పర్వతాలు, మహమ్మద్‌పాషా, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభ్యున్నతికి మహిళా శక్తి

- 14 రకాల వ్యాపారాలకు రూ.106.93 కోట్లతో ప్రణాళికలు
- ఐదు మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు
- 521 గ్రామ సంఘాల్లోని 11,618 మంది మహిళలకు లబ్ధి

మెదక్, జూలై 29 (నమస్తే తెలంగాణ): మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మహిళా శక్తి పథకంతో మెదక్ జిల్లాలో వేలాది మందికి జీవనోపాధి లభించనున్నది. సుమారు 14 రంగాల్లో యూనిట్ల ఏర్పాటుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఏర్పాట్లు ముమ్మరంచేశారు. జిల్లాలోని 20 మండలాల్లో 521 గ్రామైక్య, 13,243 స్వయం సహాయక సంఘాలున్నాయి. వీటిల్లో 1,32,430 మంది సభ్యులున్నా రు. గ్రామ సంఘాలకు మహిళా శక్తి పథకం వర్తింపజేసి రూ. 106.93 కోట్లతో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పక్కా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీంతో సుమారు 11,618 మంది మహిళలకు లబ్ధి చేకూరనున్నది. ఇప్పటికే 14 రకాల యూనిట్లతో గ్రామ సంఘాల్లోని మహిళల ఆసక్తి మేరకు యూ నిట్లు నెలకొల్పుతున్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టేందుకు అవసరమైన మిషన్లు, కటింగ్ మిషన్లు ఇతర సామగ్రిని బ్యాంకు రుణాలతో ఏర్పాటు చేయించారు.

### జిల్లాలో 9,539 యూనిట్ల ఏర్పాటు

జిల్లాలోని ప్రతి మహిళా సంఘం సభ్యురాలికి ఏదైనా ఒక యూనిట్‌లో భాగస్వామ్యం ఇవ్వడమో లేక సొంతంగా యూనిట్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించేలా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా 9,539 యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకున్నారు. ఇందులో మైక్రో ఎంట్రర్ ప్రైజెస్‌లో 7578 మందికి 3403 మంది, కుట్టు సెంటర్లు 979 మందికి 761 మంది, పెరటికోళ్ల పెంపకం 1000 మంది సభ్యులకు 1003 మంది, కోడిపిల్లల ఉత్పత్తి యూనిట్లకు 20 మందికి 28 మంది, మీసేవ కేంద్రాలు 26 మందికి 26 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌లో అత్యధికంగా 21 మంది సభ్యులతో రూ.31.20 లక్షలతో ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

| యూనిట్ పేరు | మండలాలు | ప్రాతిపాదిక యూనిట్లు | సభ్యులు | పెట్టుబడి అంచనా (లక్షల్లో) |
|---|---|---|---|---|
| మైక్రో ఎంట్రర్‌ప్రైజెస్ | 20 | 7588 | 7588 | 8642 |
| కుట్టు సెంటర్లు | 20 | 87 | 979 | 487.20 |
| పాడిగేదెలు, ఆవులు | 20 | 600 | 600 | 540 |
| పెరటికోళ్ల పెంపకం | 20 | 1000 | 1000 | 150 |
| కోడిపిల్లల ఉత్పత్తి | 20 | 20 | 20 | 58.20 |
| మొబైల్‌చేపల విక్రయం | 1 | 1 | 5 | 10 |
| పాల కేంద్రం | 1 | 1 | 1 | 1.90 |
| మీ సేవ కేంద్రాలు | 16 | 26 | 26 | 65 |
| ఈవెంట్ మేనేజ్‌మెంట్ | 1 | 1 | 21 | 31.20 |
| క్యాంటీన్లు | 5 | 5 | 40 | 100 |
| సోలార్ యూనిటు | 1 | 1 | 328 | 400 |
| ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ | 1 | 1 | 10 | 8 |
| ఆహారశుద్ధి యూనిట్లు | 10 | 100 | 200 | 400 |
| వ్యవసాయ పరికరాల యూనిట్ | 8 | 8 | 800 | 200 |



### లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతున్నది

మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా 14 రకాల వ్యాపారాలను గుర్తించి వాటి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేస్తున్నాం. జిల్లాలో 521 సంఘాల్లోని 11,618 మంది మహిళలకు ఈ పథకం వర్తింపజేస్తున్నాం. మహిళా శక్తి పథకంలో భాగంగా జిల్లాలో ఐదు మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారుల సూచన మేరకు ప్రణాళికలు సిద్ధం చేశాం.
- శ్రీనివాస్‌రావు, డీఆర్‌డీవో, మెదక్

## జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు అంకిత్



మెదక్ మున్సిపాలిటీ, జూలై 29: రాష్ట్రస్థాయి జూనియర్ ఫుట్‌బాల్ బాలుర ఎంపికల్లో జిల్లాకు చెందిన మాలోత్ అంకిత్ ప్రతిభ కనబర్చి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్‌బాల్ అసోసీయేషన్ కార్యదర్శి నాగరాజు తెలిపారు. తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈనెల 22 నుంచి 25 వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొనగా, అంకిత్ ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈనెల 30 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు అస్సాంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున అంకిత్ పాల్గొంటారన్నారు. అంకిత్ రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. జాతీయస్థాయి పోటీలకు అంకిత్ ఎంపిక కావడం పట్ల పలువురు అభినందించారు.

## వసతిగృహాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా విద్యార్థి సంఘం నాయకులు

రామాయంపేట, జూలై 29: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్ కోరారు. సోమవారం పట్టణ శివారులోని కస్తూర్బా, తెలంగాణ మాడల్ స్కూల్ తదితర విద్యాలయాలు, వసతిగృహాలను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులతో విద్యార్థులు బాధపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వైద్యాధికారులు వెంటనే స్పందించి వసతి గృహాల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయనతో మండల అధ్యక్షుడు జగన్, జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్ తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయురాలిపై సస్పెన్షన్ ఎత్తివేయాలి



మెదక్ మున్సిపాలిటీ, జూలై 29: ఇష్టారీతిగా జుట్టు పెంచుకొని విచిత్ర వేషధారణతో పాఠశాలకు వచ్చిన విద్యార్థుల జుట్టు కత్తిరించిన ఖమ్మం జిల్లా పేరువంచ ఉన్నత పాఠశాల టీచర్ శిరిష సస్పెన్షన్ ఎత్తివేయాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సోమవారం తపస్ నాయకులు మాధవరెడ్డి, వినోద్, శ్రీధర్‌రెడ్డి, నర్సింలు, నరేందర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులు ఎంత చెప్పినా వినకపోవడంతో మార్చే ప్రయత్నం చేశారన్నారు. కాలనుగుణంగా విచిత్రమైన మార్పులు వస్తున్నాయని, వాటిని తల్లిదండ్రులు సరిచేయాలన్నారు. టీచర్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలన్నారు.

## మహంకాళి అమ్మవారికి మహా నైవేద్యం




రామాయంపేట, జూలై 29: రామాయంపేటలోని మహంకాళి అమ్మవారికి ఆలయ చైర్మన్ దంపతులు సోమవారం మహా నైవేద్యం సమర్పించారు. పూలతో అలంకరించి, అభిషేకించారు. నైవేద్యాలు, మంగళహారతులు సమర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ రవిశర్మ, శ్యాంరాజు, యాదగిరి, సత్యం, నరేశ్ తదితరులు ఉన్నారు.

## పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి



రామాయంపేట, జూలై 29: బీజేపీ ప్రభు త్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని మెదక్ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరించా రు. కార్యక్రమంలో నార్సింగ్ మండల అధ్యక్షుడు నాగరాజు, చామంతి ప్రశాంత్, తుడుం బాబు, నటరాజు, సిద్దిరాములు ఉన్నారు.




చేగుంట, జూలై 29: రామాయంపేట సీఐ వెంకట్‌రాజ్‌గౌడ్‌ను గౌడజన హక్కుల పోరాట సమితి, మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొండపురం బాల్‌రాజ్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి బుచ్చన్నగారి కిషన్‌గౌడ్, నాయకులు రాజేశ్వర్‌గౌడ్, ఎల్లాగౌడ్ సోమవారం మార్యాదపూర్వకంగా కలిసి, శాలువా కప్పి సన్మానించారు.

## అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి


అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

### - ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి


పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

మెదక్ అర్బన్, జూలై 30: అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు నిర్భయంగా, ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవల్ని వినియోగించుకోవాలన్నారు. వారి సమస్యలు చట్టప్రకారం పరిష్కరించుకోవాలన్నారు.

**శాంతి భద్రతల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు**

శాంతి భద్రతల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టడంతో పాటు ప్రజలకు న్యాయం అందేలా చూస్తామని ఎస్పీ తెలిపారు. మెదక్‌రూరల్, హవేళీఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేశారు. కేసులు, రికార్డులు, పోలీసుస్టేషన్‌లో పరిసరాలు పరిశీలించి పలు సూచనలు చేశారు. నేర దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆయన వెంట రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఏఎస్సై శివకుమార్, సిబ్బంది ఉన్నారు.

**పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ**

కొల్చారం, జూలై 29: కొల్చారం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు తీసుకుని పరిష్కరించాలన్నారు. ఏడుపాయల కమాన్ రోడ్డులో ప్రమాదాలు జరుగకుండా గస్తీ ఏర్పా టు చేయాన్నారు. ఆయనతో కొల్చారం ఎస్సై మహమ్మద్‌గౌస్, కానిస్టేబుల్ సౌందర్య, సిబ్బంది ఉన్నారు.

## నర్సాపూర్‌లో ఘనంగా బోనాలు


ఊరేగింపులో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్


నర్సాపూర్‌లో బండ్లను ఊరేగిస్తున్న భక్తులు

నర్సాపూర్, జూలై 29: నర్సాపూర్ పట్టణంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని బోనాల్లో భాగంగా రెండో రోజు సోమవారం ఫలహార బండ్లు, బోనాల ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గొర్రె పాటేళ్ల బండ్లు, పోతరాజుల విన్యాసాలు, బ్యాండ్ మేళాల మధ్య ఊరేగింపు అందరినీ ఆకట్టుకున్నాయి. పట్టణానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలను అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలకు మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కౌన్సిలర్ లలితా భిక్షపతి పాల్గొన్నారు.

### నేడు రేణుకా ఎల్లమ్మ బోనాలు

రామాయంపేట, జూలై 29: నేడు రామాయంపేట శివారులోని కేసీఆర్ కాలనీలో బోనాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. మంగళవారం కాలనీలో ఇంటింటికీ బోనం తీయనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం వన భోజనాలకు తరలివెళ్లనున్నట్లు తెలిపారు.

### దేవతామూర్తులను దర్శించుకున్న జడ్జి



నర్సాపూర్, జూలై 29: నర్సాపూర్‌లో జరుగుతున్న బోనాల ఉత్సావాల్లో భాగంగా జూనియర్ సివిల్ జడ్జి అనిత సోమవారం దేవతామూర్తులను దర్శించుకున్నారు. పట్టణంలోని దుర్గమ్మ, నల్లపోచమ్మ ఆలయాలను సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ అనసూయగౌడ్ ఉన్నారు.

### శతాధిక వృద్ధురాలు మృతి


బేగరి రామమ్మ (ఫైల్)

శివ్వంపేట, జులై 29: మండలంలోని గూడూరులో శతాధిక వృద్ధురాలు బేగరి రామమ్మ (101) సోమవారం మృతి చెందింది. బేగరి రామమ్మ వంద ఏండ్ల సంబురాన్ని కుటుంబసభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో కేక్ కట్ చేసి జరుపుకొన్నారు. అకస్మాత్తుగా ఆమె ఆరోగ్యం క్షీణించి సోమవారం మృతి చెందింది. హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మీ శ్రీనివాస్ గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణాగౌడ్, నాయకుడు యాదగౌడ్ రామమ్మ మృతికి సంతాపం తెలిపారు.

### ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేట కమాన్, జూలై 29 : మహిళలు బ్యూటీషియన్, మగ్గంవర్క్, టైలరింగ్‌లో శిక్షణ తీసుకొని స్వయం ఉపాధి పొందాలని ప్రగతి ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సిద్దిపేట సంస్థ అధ్యక్షురాలు వడ్డేపల్లి స్వరూపరాణి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ 30 రోజులు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని, ఆగస్టు 3 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. శిక్షణ కోసం ఆధార్ జిరాక్స్‌తో పాటు రెండు పాస్‌ఫొటోలతో పాత బస్టాండ్ వద్ద దేవినిలయం మొదటి అంతస్తులో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 988585262, 949199 5033 సంప్రదించాలన్నారు.

### రోడ్డును బాగు చేయించిన యువకులు

జిన్నారం, జూలై 29: మాదారం గ్రామం నుంచి మెడికల్ డివైజ్ వెళ్లే రోడ్డును గ్రామ యువకులు రాజుగౌడ్ ఆధ్వర్యంలో గుంతలను మట్టితో సోమవారం పూడ్చివేశారు. దీంతో రాకపోకలకు మార్గం బాగైంది. మాదారం నుంచి మెడికల్ డివైజ్‌లో ఉపాధి కోసం 200 మంది వెళ్తుంటారు. వర్షాకాలం కావడంతో రోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడి నీళ్లు నిలిచాయి. సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డుపై ఏర్పడిన గుంతలను టిప్పర్లతో మట్టి తెప్పించి, పూడ్చివేశారు. సమస్యను గుర్తించి రోడ్డు బాగు చేయడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WATER PROOFING
★ Roof & Wall Crack Filling, Water Proofing Coatings, New & Old Bhathrooms Leakages, Water Tank & Sump Leakages, Rain Coat & Pest Control, Slab & Beems Injection Work, 10 years Waranty. Call: 9010425273, 8121425273.
NT-326124
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
సిద్దిపేట/గజ్వేల్/తూప్రాన్/మెదక్ : 80966 77663
సంగారెడ్డి/జహీరాబాద్/నారాయణఖేడ్ : 9182777658
పటాన్‌చెరు : 80966 77657